సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.15 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
35.3°/21.1°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

యూరియా అధికంగా వాడితే తెగుళ్లు

- రైతులతో కలెక్టర్ చేతన్



పెడపల్లిలో మొక్కజొన్న రైతుతో ముచ్చటిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: '' పంటల సాగులో అధికారులు సూచించినంత మేరకే మేరకే యూరియా వాడాలి. అధికంగా వాడితే పంటలకు తెగుళ్ల సోకుతాయి'' అని కలెక్టర్ చేతన్ రైతులకు సూచించారు. నీరు ఎక్కువగా అవసరమయ్యే వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలన్నారు. సోమవారం ఆయన పుట్టపర్తి మండలం పెడపల్లి, కొత్తచెరువు మండలం పోతులకుంట గ్రామాలను సందర్శించి అక్కడి మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి యూరియా నిల్వ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు పెడపల్లిలో రైతు బ్రహ్మానందరెడ్డి మొక్కజొన్న పంటను పరిశీలించిన కలెక్టర్ రైతుతో మాట్లాడారు. పంటకు ఎంత యూరియా వేశారు...ఎక్కడ కొనుగోలు చేశారంటూ ఆరా తీశారు. అధికారుల సిఫార్సు మేరకే యూరియా, ఎరువులు వాడారా.. అని అడిగి తెలుసుకున్నారు. కొత్తచెరువు మండలంలో యూరియా పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. అదేవిధంగా హెల్త్ క్లినిక్‌లను సందర్శించి రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్లు కళ్యాణచక్రవర్తి, బాలాంజనేయులు, ఏఓలు శ్రీవాణి, సతీష్, వీఆర్‌ఓలు, వీఏఏలు ఉన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు: కలెక్టర్

ప్రశాంతి నిలయం: జిల్లాలో యూరియా ఎరువుల కొరత లేదని, పంటల నమోదు ఆధారంగా రైతులకు అవసరమైన యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది ఆలస్యంగా వర్షాలు కురిసినా, తగినంత వర్షపాతం నమోదయ్యిందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ 45,000 హెక్టార్లు, మొక్కజొన్న 15,000 హెక్టార్లు, కంది 16,000 హెక్టార్లు, వరి 4 వేల హెక్టార్లలో సాగులో ఉందన్నారు. ఇప్పటి వరకు జిల్లాకు 5,500 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయ్యిందన్నారు. రోజూ సగటున 145 నుంచి 150 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అవుతోందన్నారు. రైతులు ఈనెల 30వ తేదీలోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు.

871 మెట్రిక్ టన్నుల యూరియా రాక



అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాకు 871 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరమాండల్ కంపెనీ (సీఐఎల్) నుంచి 601 మెట్రిక్ టన్నులు, పారాదీప్ ఫాస్ఫేట్ కంపెనీ (పీపీఎల్) నుంచి 270 మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరిందన్నారు. ఇందులో మార్క్‌ఫెడ్‌కు 530 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్లకు 341 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఇండెంట్ ప్రకారం సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

అక్టోబర్ 4న 'రెడ్‌క్రాస్' నూతన కమిటీ ఎన్నిక


ప్రశాంతి నిలయం: జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహణ కమిటీ ఎన్నిక అక్టోబర్ 4వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా సహకార శాఖ అధికారి, ఎన్నికల అధికారి కృష్ణానాయక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారమే నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 4వ తేదీ ఉదయం 11 గంటలకు పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి గణేష్ సర్కిల్‌లోని జిల్లా సహకార అధికారి కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశానికి రెడ్‌క్రాస్ సొసైటీ పోషకులు, ఉప పోషకులు, జీవితకాల సభ్యులు, జీవితకాల అనుబంధ సభ్యులందరూ తమ ఆధార్ కార్డు, సభ్యత్వ కార్డులతో హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో కనీసం 10 మంది సభ్యులతో కూడిన జిల్లా రెడ్‌క్రాస్ నూతన నిర్వహణ కమిటీని ఎన్నుకుంటారన్నారు. అదేరోజు కమిటీ సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నిక కూడా జరుగుతుందని వివరించారు.

యూరియా లే 'దయ'

- జిల్లాలో నిండుకున్న యూరియా నిల్వలు
- ఆర్‌ఎస్‌కేలు, సొసైటీల వద్ద రైతుల పడిగాపులు
- వ్యవసాయ పనులు మానుకుని మండల కేంద్రాల్లో నిరీక్షణ
- అరకొర సరఫరాతో ఎక్కడ చూసినా బారులు
- రైతు కోసం నేడు వైఎస్సార్‌సీపీ 'అన్నదాత పోరు'
- అన్ని ఆర్డీఓ కార్యాలయాల వద్ద ధర్నా

కూటమి సర్కారు నిర్లక్ష్యం.. రైతులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టింది. పంటల దిగుబడిపై ప్రభావం చూపే యూరియా తెప్పించడంలో సర్కారు విఫలం కాగా, జిల్లాలో ఎక్కడ చూసినా 'రైతుల బారులు' కనిపిస్తున్నాయి. చాలా మండలాల్లో బస్తా యూరియా కూడా సరఫరా కాకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన ప్రజాప్రతినిధులు విజయోత్సవాల్లో మునిగిపోయారు. అందుకే రైతన్నకు తోడుగా మంగళవారం వైఎస్సార్ సీపీ 'అన్నదాత పోరు'కు సిద్ధమైంది.

యూరియా కొరత.. రైతు కలత



సాక్షి, పుట్టపర్తి/ పుట్టపర్తి అర్బన్: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతు పరిస్థితి అగమ్యగోచరమైంది. సీజన్‌కు ముందే పంటలసాగును అంచనా వేసి ఎరువులు తెప్పించాల్సిన పాలకులు నిర్లక్ష్యం వహించడంతో రైతులకు యూరియా కష్టాలు మొదలయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచిపోయినా... ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలకు ఒక్క ఎరువు బస్తా కూడా చేర్చలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనులు మానుకుని రోజూ మండల కేంద్రాల్లోని ఫర్టిలైజర్ షాపుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో పాలకులపై దుమ్మెత్తిపోస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మే నెలాఖరులోపే రైతు భరోసా కేంద్రాలకు ఎరువులను చేర్చేదని, గ్రామాల్లోనే కావాల్సినన్ని ఎరువులు అందించేదని గుర్తు చేసుకుంటున్నారు.

బ్లాక్ దందా..

జిల్లాలో కావాల్సినంత యూరియా ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ ఏ దుకాణంలో వెళ్లి అడిగినా లేదనే అంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదనుగా.. కొందరు వ్యాపారులు, కూటమి నేతలు సిండికేటుగా మారి యూరియాను దారి మళ్లించి.. అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం యూరియా బస్తా రూ.267కు ఇస్తామంటోంది. కానీ బహిరంగ మార్కెట్‌లో బస్తా రూ.500 వరకు విక్రయిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే.. వాళ్లు వచ్చేలోపు దుకాణం సర్దేస్తున్నారు.

డిమాండ్ ఉన్నప్పటికీ..

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో సుమారు 75 వేల హెక్టార్లలో పంటలు సాగు చేశారు. మరో 63 వేల హెక్టార్లలో ఉద్యాన పంటలు వేశారు. ఖరీఫ్‌లో వరి పంట 7 వేల హెక్టార్లలో.. మొక్కజొన్న 16 వేలకు పైగా హెక్టార్లలో సాగులో ఉన్నాయి. వరి, మొక్కజొన్న పంటలకు యూరియా ఎక్కువగా వినియోగిస్తారు. ఎకరా వరి పంటకు నాలుగు బస్తాల వరకు యూరియా వేస్తారు. అదే మొక్కజొన్న పంటకు అయితే ఎకరాకు 5 నుంచి 8 బస్తాల వరకు విడతలవారీగా వినియోగించాలి. జిల్లాలో కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందని, ఇంకో 2 వేల టన్నుల కోసం ఇండెంట్ పెట్టినట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ఏ రైతును పలకరించినా.. యూరియా దొరకలేదని చెబుతున్నారు.

బయో కొంటేనే..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో యూరియాను బ్లాక్ చేసిన కొందరు వ్యాపారులు ధర భారీగా పెంచారు. రూ.267 చొప్పున విక్రయించాల్సిన యూరియా బస్తాను రూ.500 వరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. అది కూడా తాము సూచించిన బయో ఎరువులను కొంటేనే యూరియా ఇస్తామని షరతు పెడుతున్నారు. దీంతో అవసరం లేకున్నా రైతులు బయో ఎరువులను కొనుగోలు చేస్తున్నారు.



యూరియా బారులు

కొత్తచెరువులోని ప్రధాన మంత్రి రైతుల సమృద్ధి కేంద్రం వద్ద ఈనెల 5వ తేదీ (శుక్రవారం) కనిపించిన దృశ్యమిది. మండలంలో చాలా మంది రైతులు ప్రస్తుతం వరినాట్లు వేశారు. ఇప్పుడు యూరియా చల్లకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అందువల్ల రైతులంతా ఉదయమే మండల కేంద్రానికి చేరుకుంటున్నారు. ఈ నెల 5వ తేదీన 160 బస్తాల యూరియా రాగా, టోకెన్లు ఇచ్చి పోలీసుల రక్షణలో పంపిణీ చేశారు. యూరియా అందని రైతులు గొడవకు దిగగా, దుకాణం మూసివేసి వెళ్లారు. – కొత్తచెరువు:



నేడు 'అన్నదాత పోరు'

యూరియా కోసం రైతుల అవస్థలు చూసి చలించిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరుబాటకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే మంగళవారం రైతుల తరఫున వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్డీఓ కార్యాలయాల ఎదుట ధర్నాకు తలపెట్టింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలనే డిమాండ్‌తో ఆర్డీఓలకు వినతిపత్రాలు అందజేయనున్నారు. జిల్లాలో పెనుకొండ, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి ఆర్డీఓ కార్యాలయాల వద్ద మంగళవారం ధర్నా చేపట్టనున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఆయా ఆర్డీఓ కార్యాలయాల వద్దకు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు.

75 వేల హెక్టార్లు ఖరీఫ్‌లో సాగైన వివిధ రకాల పంటలు	**19** వేల మెట్రిక్ టన్నులు ఖరీఫ్‌లో జిల్లాకు కావాల్సిన యూరియా
63 వేల హెక్టార్లు సాగైన ఉద్యాన పంటలు	**304** మెట్రిక్ టన్నులు జిల్లాకు ప్రస్తుతం వచ్చిన యూరియా

2,000 మెట్రిక్ టన్నులు
అధికారులు పెట్టిన యూరియా ఇండెంట్

యూరియా కోసం రైతుల ఆందోళన

లేపాక్షి: యూరియా కోసం మండలంలోని కల్లూరు రైతు సేవా కేంద్రం వద్ద రైతులు ఆందోళనకు దిగారు. 15 రోజుల క్రితం టోకెన్లు ఇచ్చినా యూరియా ఇవ్వరా..? అంటూ నిలదీశారు. వివరాల్లోకి వెళితే... కల్లూరు రైతు సేవా కేంద్రం పరిధిలోని పలువురు రైతులకు అధికారులు యూరియా పంపిణీ నిమిత్తం 15 రోజుల క్రితం టోకెన్లు ఇచ్చారు. సోమవారం యూరియా పంపిణీ ఉందని తెలుసుకున్న వారంతా రైతు సేవా కేంద్రానికి వచ్చారు. అయితే అధికారులు మాత్రం గతంలో టోకెన్లు ఇచ్చిన రైతులను కాదని, కొత్తగా కొంతమందికి టోకెన్లు ఇచ్చి యూరియా పంపిణీ చేశారు. దీంతో గతంలో టోకెన్లు తీసుకున్న రైతులు తమకు తొలుత యూరియా పంపిణీ చేయాలని ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో రైతుల మధ్య వివాదం నెలకొంది. ఓ దశలో రైతులు ఘర్షణకు దిగేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సర్దిచెప్పారు. గతంలో టోకెన్లు తీసుకున్న వారికి పంపిణీ చేసిన తర్వాతే ప్రస్తుతం టోకెన్లు తీసుకున్న రైతులకు యూరియా పంపిణీ చేసేలా అధికారులతో మాట్లాడారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.



లేపాక్షి: ఆర్‌ఎస్‌కే వద్ద రైతులకు సర్ది చెబుతున్న పోలీసులు

ఒక్క రోజులోనే మాయం



యూరియా లేకపోవడంతో వెలవెలబోతున్న బత్తలపల్లిలోని ఓ ఎరువుల దుకాణం

- ఈ నెల 4వ తేదీ (గురువారం) సాయంత్రం 3 గంటల సమయంలో ధర్మవరం ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ స్వర్ణలత, వ్యవసాయాధికారి ఓబిరెడ్డి బత్తలపల్లిలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. 13 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని, రైతులకు కావాల్సినంత యూరియా పంపిణీ చేస్తామన్నారు.
- ఈ నెల 5వ తేదీ (శుక్రవారం) ఉదయం బత్తలపల్లిలోని ఎరువుల దుకాణాల వద్దకు వెళ్లిన రైతులకు దుకాణాల యజమానులు యూరియా స్టాకు లేదని సమాధానం ఇచ్చారు. ఇలా ఒక్కరోజులోనే అధికారులు ప్రకటించిన 13 మెట్రిక్ టన్నుల యూరియా అయిపోయిందా అంటూ ముక్కున వేలేసుకున్నారు. – బత్తలపల్లి:



ఈనెల 5న పోలీసుల రక్షణతో కొత్తచెరువులో యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు

బయో కొంటేనే యూరియా..



యూరియా బస్తా కావాలంటే ఇతర బయో ఎరువులు కొనాలని దుకాణదారులు షరతు పెడుతున్నారు. దీంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సమస్య వ్యవసాయాధికారులకు చెప్పినా... ప్రయోజనం ఉండటం లేదు. అధికారులేమో యూరియా స్టాకు ఉందని చెబుతున్నారు. దుకాణానికి వెళ్తే లేదని చెబుతున్నారు. కనీసం యూరియా కూడా సకాలంలో అందించలేకపోతే ఎలా..? గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లోనే కావాల్సినన్ని ఎరువులు దొరికేవి. – రంగనాథరెడ్డి, రైతు, రాఘవంపల్లి, బత్తలపల్లి మండలం

అబద్ధపు ప్రకటనలు ఆపండి



ప్రస్తుతం అరటి, మొక్కజొన్న పంటకు యూరియా అవసరం చాలా ఉంది. దీంతో రైతులు రోజూ మండల కేంద్రానికి వచ్చి యూరియా కోసం వాకబు చేస్తున్నారు. అధికారులేమో తగినంత యూరియా ఉందని ప్రకటనలిస్తున్నారు. దుకాణం వద్దకు వెళ్తే స్టాక్ లేదని చెబుతున్నారు. అధికారులను గట్టిగా నిలదీస్తే మాత్రం రెండురోజుల్లో యూరియా వస్తుందంటున్నారు. తప్పుడు ప్రకటనలతో రైతులను మోసం చేయడం తగదు. – బగ్గిరి బయపరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్, బత్తలపల్లి

గతంలో ఎన్నడూ ఇబ్బందుల్లేవు



ఎరువుల కోసం రోడ్డెక్కడం గతంలో ఎన్నడూ చూడలేదు. చంద్రబాబు ప్రభుత్వంలో వ్యవసాయం వెనుకడుగు వేస్తుందనడంలో అనుమానం లేదు. అధికారులు యూరియా ఉందని చెబుతున్నా.. గ్రామ స్థాయిలో యూరియా కోసం చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పడం లేదు. ఇలాగైతే రైతు కాడి కింద పడేయడం ఖాయం. – నారాయణరెడ్డి, బీడుపల్లి, పుట్టపర్తి

యూరియా కూడా ఇవ్వలేరా?



కూటమి సర్కార్ రైతుకు ఎలాంటి మేలు చేయడం లేదు. విత్తనాలు కూడా సకాలంలో ఇవ్వలేకపోయింది. ఇప్పుడు నానా కష్టాలు పడి పంటలు పండిస్తుంటే యూరియా కూడా ఇవ్వలేకపోతోంది. ఇది చేతగాని ప్రభుత్వం. రైతుల కష్టాలు పట్టని ప్రభుత్వం. ముఖ్యమంత్రి, మంత్రులు మాత్రం యూరియా కావాల్సినంత ఉందంటూ ప్రకటనలు చేస్తున్నారు. నిజంగా వారికి ధైర్యం ఉంటే మండల కేంద్రాలకు వచ్చి రైతులను కలిస్తే వాస్తవం తెలుస్తుంది. – అవుటాల రమణా రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్

రైతులు కష్టాల్లో ఉంటే విజయోత్సవాలా?



వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి 'అన్నదాత పోరు' పోస్టర్లు విడుదల చేస్తున్న ఉష శ్రీ చరణ్

- యూరియా కూడా ఇవ్వలేని మీదీ ఓ ప్రభుత్వమా?
- అది సూపర్ హిట్ కాదు ...అట్టర్‌ఫ్లాప్ సభ
- రైతు కోసం మేం నిలబడ్డాం..పోరుబాట చేస్తున్నాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్

పెనుకొండ రూరల్: ''రైతులు యూరియా కోసం రోడ్లపై తిరుగుతుంటే.. మీరు మాత్రం విజయోత్సవాలు చేసుకుంటారా..? రైతు గురించి ఏనాడైనా ఆలోచించారా..మీ వ్యవహార శైలి చూస్తుంటే రైతు సంక్షేమంపై మీకే మాత్రం చిత్తశుద్ధి ఉందో తెలుస్తుంది. మీ పాలన సూపర్ హిట్ కాదు...అట్టర్ ఫ్లాప్'' అంటూ కూటమి నాయకులపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజమెత్తారు. సోమవారం ఆమె పెనుకొండలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి 'అన్నదాత పోరు' పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులను వంచనకు గురిచేయడంలో కూటమి ప్రభుత్వం హిట్ కొట్టిందన్నారు. రాష్ట్రంలో బంగారం దొరుకుతోందని కానీ, యూరియా దొరకడం లేదన్నారు. విత్తనాలు, ఎరువులు అన్నింటికీ రైతులు అడుక్కోవాల్సి వస్తోందన్నారు. ఈ పాలకులకు రైతుల కష్టాలు పట్టడం లేదన్నారు. రైతు సంతోషంగా ఉండాలంటే వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏం చేశారో ఒక్కసారి జ్ఞాపకం చేసుకోవాలని సూచించారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ముంగిటకే విత్తనాలు, ఎరువులు తెచ్చారన్నారు. కూటమి అసమర్థ పాలనలో యూరియా కోసం పడరానిపాట్లు పడుతున్న రైతుల కోసం వైఎస్సార్ సీపీ మంగళవారం 'అన్నదాత పోరు'కు శ్రీకారం చుట్టిందన్నారు. వైఎస్సార్ సీపీ ఎప్పుడూ రైతు పక్షమేనన్నారు. రైతు కోసం నిలబడ్డామని, వారికి ఏ కష్టం వచ్చినా పోరుకు సిద్ధమన్నారు.

రైతులు వీధుల్లో.. మంత్రులు సీఎం సభ ఏర్పాట్లలో..

- యూరియా కోసం రైతుల పడిగాపులు
- ఒక్క బస్తా కోసం రాత్రంతా జాగరణ
- సగం కేబినెట్ వారం రోజులుగా అనంతపురంలోనే మకాం
- చంద్రబాబు సభ ఏర్పాట్ల కోసం ముమ్మరంగా కృషి
- మా బాధలు మీకు పట్టవా అంటూ మంత్రులపై రైతుల ఆగ్రహం



అనంతపురంలో సీఎం సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో రైతులు యూరియా కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఒక్క బస్తా యూరియా దొరికినా చాలు అంటూ తెల్లార్లూ జాగారం చేస్తున్న పరిస్థితి. ఏ ఊరికెళ్లినా యూరియా కోసం బారులు తీరిన దృశ్యాలే కనిపిస్తున్నాయి. రైతన్నల ఇబ్బందులపై సామాజిక మాధ్యమాల్లోనూ శరపరంపరగా పోస్టులు కన్పిస్తున్నాయి. సర్కారు తీరుపై సామాన్యులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇంత జరుగుతున్నా దగ్గరుండి రైతుల కష్టాలు తీర్చాల్సిన మంత్రులు అసలు ఏమాత్రమూ పట్టించుకోవడం లేదు. 'మీరు ఏం చావు చస్తే మాకేమిటీ' అన్నట్టు వ్యవహరిస్తున్నారు. మరోవైపు రైతులు అర్ధరాత్రి నుంచే యూరియా కోసం పంపిణీ కేంద్రాలు, ఎరువుల దుకాణాల ముందు క్యూ కడుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం సభ ఏర్పాట్లలో ఉండగా.. అధికారులు కూడా రైతుల సమస్యలు గాలికొదిలి సీఎం సభ కోసమే పనిచేస్తున్నారు.

సగం కేబినెట్ అనంతపురంలోనే..

రాష్ట్రంలో ఒక జిల్లాలోనో, ఒక నియోజకవర్గంలోనో కాదు ఊరూరా యూరియా కష్టాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో వారికి అండగా నిలవాల్సిన మంత్రులకు, ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు సభ ఏర్పాట్లే ముఖ్యమయ్యాయని సామాన్యులు వాపోతున్నారు. ఈ నెల 10వ తేదీన 'సూపర్ సిక్స్–సూపర్‌హిట్' అనే కార్యక్రమాన్ని అనంతపురంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం 10 మంది మంత్రులు వారం రోజులుగా ఇక్కడే ఉన్నారు. సీఎంతో పాటు పవన్‌కల్యాణ్, లోకేష్ సభకు వస్తున్నారని, అట్టహాసంగా చేయాలన్న ఆలోచనతో మంత్రులు ఈ ఏర్పాట్లలోనే నిమగ్నమయ్యారు. మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నారాయణ తదితరులంతా ఇక్కడే ఉన్నారు. ఇక రాయలసీమ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు కూడా రైతుల సమస్యలు గాలికొదిలి సీఎం సభ ఏర్పాట్ల నిమిత్తం అనంతపురంలో మకాం వేశారు.

నియోజకవర్గాల్లో ఒక్కరూ లేరు..

మంత్రుల మాట దేవుడెరుగు ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలంతా సీఎం సభ ఏర్పాట్లలోనే తరిస్తున్నారు. రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో వరి ఎక్కువగా పండిస్తారు. గడిచిన పక్షం రోజులుగా ఇక్కడ యూరియా లేదు. కానీ నియోజకవర్గ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అనంతపురం వదలి అక్కడికి వెళ్లడం లేదు. మడకశిర నియోజకవర్గంలో రెండ్రోజుల క్రితం తాగునీరు లేక ప్రజలు రోడ్డెక్కారు. కానీ ఆ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాత్రం అనంతపురంలోనే ఉన్నారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం, పుట్టపర్తి, రాప్తాడు..ఇలా అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలూ సీఎం సభ కోసమే పనిచేస్తున్నారు. సభ సందర్భంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టడం కోసం ఒకర్ని మించి ఒకరు పోటీపడుతున్నారు. వీరు తీరును రైతులు, ప్రజలు ఏవగించుకుంటున్నారు.

క్లుప్తంగా

రేపు 'అనంత'లో ట్రాఫిక్ మళ్లింపు

అనంతపురం: సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఈ నెల 10న అనంతపురంలో ట్రాఫిక్‌పై ఆంక్షలు విధిస్తున్నట్లు ఆ జిల్లా ఎస్పీ జగదీష్ ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

- హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపు వెళ్లే వాహనాలు వడియంపేట నుంచి బుక్కరాయసముద్రం – నాయనపల్లి క్రాస్ – నార్పల క్రాస్ – బత్తలపల్లి – ధర్మవరం – ఎస్‌ఎస్‌గేట్ మీదుగా 44వ జాతీయ రహదారిపైకి చేరుకోవాలి.
- కర్నూలు నుంచి తిరుపతి, చెన్నై వెళ్లే వాహనాలు వడియంపేట – బుక్కరాయసముద్రం – నాయనపల్లిక్రాస్ – నార్పల క్రాస్ – బత్తలపల్లి – కదిరి – మదనపల్లి మార్గంలో ప్రయాణించాలి.
- బళ్లారి నుంచి బెంగళూరు వెళ్లే వాహనాలు అనంతపురంలో ప్రవేశించకుండా చెళ్లకెర – తుమకూరు – నెలమంగల మీదుగా ప్రయాణించాలి.
- బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు ఎస్‌ఎస్‌గేట్ వద్ద నుంచి ధర్మవరం – బత్తలపల్లి – నార్పల క్రాస్ – నాయనపల్లి క్రాస్ – బుక్కరాయసముద్రం – వడియంపేట మీదుగా 44వ జాతీయ రహదారిపైకి చేరుకోవాలి.
- తిరుపతి/చెన్నై నుంచి కర్నూలు వెళ్లే వాహనాలు బత్తలపల్లి వద్ద నుంచి నార్పల క్రాస్ – నాయనపల్లి క్రాస్ – బుక్కరాయ సముద్రం – వడియంపేట మీదుగా ప్రయాణించాలి.
- బెంగళూరు నుంచి బళ్లారి వెళ్లే వాహనాలు అనంతపురం మీదుగా కాకుండా బెంగళూరు – నెలమంగల– తుమకూరు
- చెళ్లకెర మార్గంలో ప్రయాణించాలి.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

ధర్మవరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఆగస్టు 28న మేడాపురం క్రాస్ వద్ద ధర్మవరంలోని వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థి ఉదయ్‌కిరణ్(21) ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడికి తొలుత ధర్మవరం, అనంతపురం, కర్నూలు, బెంగళూరు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్, కళాశాల ఇన్‌చార్జ్ రమేష్, విద్యార్థులు సోమవారం సంతాపం తెలిపారు.

ఆహారం.. కల్తీ మయం!



కదిరి పట్టణంలోని అరబిక్ రెస్టారెంట్‌లో ఇటీవల సిబ్బందితో కలసి మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో హోటల్‌లో కొందరు కస్టమర్లు తినలేక మిగిల్చిన మాంసం ముక్కలను అదే హోటల్‌కు వచ్చిన ఇతర భోజన ప్రియులకు వడ్డిస్తున్నారని, కుళ్లిన మాంసం, పాడైపోయిన ఆహార పదార్థాలను మళ్లీ వేడివేడిగా వడ్డిస్తూ 'ఈ రోజు స్పెషల్' అంటూ బోర్డులు పెట్టి మోసగిస్తున్నట్లుగా గుర్తించారు. దీంతో అరబిక్ రెస్టారెంట్‌ను సీజ్ చేశారు. ... ఈ పరిస్థితి ఒక్క కదిరిలోనే కాదు.. జిల్లా వ్యాప్తంగా అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాల్లో కనపడుతోంది.

- జిల్లాలోని హోటళ్లలో పాడైన ఆహార పదార్థాలు
- వంట గదులు అపరిశుభ్రం
- తనిఖీల్లో నివ్వెరపోయే అంశాలు వెలుగులోకి

కదిరి: పురుగులు పట్టిన, కాలం చెల్లిన ఆహార పదార్థాలు, కుళ్లిన మాంసం, కల్తీ మసాలాలు, మళ్లీమళ్లీ కాచి వాడుతున్న నూనెలు, అపరిశుభ్రమైన వంటశాలలు.. ఇది జిల్లాలోని పలు ధాబాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, కాఫీ కేఫ్‌ల్లోని పరిస్థితి. సాధారణ హోటళ్లలోనే కాదు. కొన్ని ప్రముఖ రెస్టారెంట్లలోనూ ఇదే దుస్థితి నెలకొంది. ఘుమ ఘుమలాడే వాసనలు, వేడి వేడి వడ్డన అంటూ వెళ్లి తింటే అనారోగ్యం పాలవడం ఖాయమని పలువురు అంటున్నారు. తాజాగా జిల్లాలో పలుచోట్ల ఆహార భద్రతా విభాగం చేపట్టిన తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనలు, ఆహార కల్తీ ఉన్నట్లు తేలింది.

• 3 వేలకు పైగా హోటళ్లు

జిల్లా వ్యాప్తంగా చిన్న, పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు.. అన్నీ కలిపి 3 వేలకు పైగా ఉన్నాయి. హిందూపురం, ధర్మవరం, కదిరి ఈ మూడు నియోజకవర్గాల్లోనే 1,800 వరకు ఉన్నాయి. పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ, రాప్తాడు నియోజవర్గాల్లో మరో 1,350 ఉన్నాయి. వీటి ద్వారా ఏటా కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతోంది. సంబంధిత అధికారులు తప్పనిసరిగా ప్రతి సంవత్సరం వీటి నుంచి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపాలి. అయితే ఈ ప్రక్రియ ఎక్కడేకానీ కనిపించడం లేదు. ఒకవేళ ఏదైనా హోటల్‌ను సీజ్ చేసినా అధికార పార్టీ నేతలతో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడుకుని వారం తిరక్కుండానే తెరుస్తున్నారు.

• అతిక్రమిస్తే రూ.5లక్షల వరకు జరిమానా

జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండానే 20 శాతానికి పైగా హోటళ్లు నిర్వహిస్తున్నారు. ఈ అంశాన్ని మున్సిపల్ పరిధిలోని కొందరు అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారు. ఎక్కడైనా హోటల్ ఏర్పాటు చేయాలంటే కచ్చితంగా ఫుడ్ సేఫ్టీ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా లైసెన్స్ తప్పనిసరి. వంట మాస్టర్‌లు, సర్వర్లకు ఎలాంటి రోగాలు లేవని ధ్రువీకరించే డాక్టర్ సర్టిఫికెట్ ఉండాలి. నిబంధనలకు వ్యతిరేకంగా హోటల్ నిర్వహిస్తున్న వారిపై సెక్షన్ 63 ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేయవచ్చు. ఇందుకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ5 లక్షలు వరకు జరిమానా ఉంటుంది.

భయమేస్తోంది



ఇటీవల కదిరిలో ఒక హోటల్‌లో జరిపిన తనిఖీల్లో వెలుగు చూసిన దృశ్యాలను చూసినప్పటి నుంచి హోటల్ ఫుడ్ అంటేనే భయమేస్తోంది. అంతా కల్తీ మయమై శరీరం రోగాల పుట్టగా మారుతోంది. లైసెన్స్ మంజూరు దగ్గర నుంచి ఆహార పదార్థాల శాంపిల్స్ తీసే విషయం వరకూ అధికారులు పారదర్శకతతో విధులు నిర్వర్తించాలి. చర్యలు కఠినంగా ఉంటే ఈ పరిస్థితి రాదు.

– సుబ్బరాయుడు, విశ్రాంత డీజీఎం, ఏడీసీసీ బ్యాంకు, కదిరి

ప్రాణానికే ప్రమాదం



హానికరమైన రంగులు, రసాయనాలతో కూడిన ఆహార పదార్థాల వల్ల క్యాన్సర్ బారిన పడే ప్రమాదముంది. జీర్ణాశయం దెబ్బతిని అల్సర్ కూడా వస్తుంది. గుండె, మూత్రపిండాలు, కాలేయం సక్రమంగా పని చేయడం మానేస్తాయి. ఫలితంగా ప్రాణానికే ప్రమాదం. కడుపునొప్పి, కీళ్ల నొప్పులు, విరేచనాలతో మెదడు పనితీరుపై ప్రభావం చూపుతుంది. ఆహార పదార్థాల్లో వాడే రసాయనాలు మెదడు, ఎముకలపై కూడా ప్రభావం చూపుతాయి. చర్మంపై దద్దుర్లు, మచ్చలు కూడా వస్తాయి.

– డాక్టర్ నాగేంద్రకుమార్‌రెడ్డి, కదిరి

చర్యలు తప్పవు



ఎక్కడైనా ఆహార పదార్థాలు కల్తీ జరిగిందని గుర్తిస్తే ప్రజలు వెంటనే ఫిర్యాదు చేయచ్చు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించిన **వారికి నోటీసులు** ఇస్తున్నాం. శాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపుతున్నాం, నివేదికలు రాగానే వాటిపై చర్యలు తీసుకుంటాం.

– రామచంద్ర, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఆటోను ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

• ముగ్గురికి తీవ్రగాయాలు

బత్తలపల్లి: మండలలోని పోట్లమర్రి సమీపంలో సోమవారం ఆటోను ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ధర్మవరం నుంచి బత్తలపల్లికి ప్రయాణికులతో బయలుదేరిన ఆటో పోట్లమర్రి సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా తాడిపత్రి నుంచి ధర్మవరానికి వెళుతున్న ఆర్టీసీ బస్సు.. ద్విచక్ర వాహనదారుడిని ఓవర్‌టేక్ చేస్తూ ఢీకొంది. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న తాడిమర్రి మండలం మద్దలచెరువు గ్రామానికి చెందిన బాలవెంగళరెడ్డి, చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామానికి చెందిన వరదరాజులు, బత్తలపల్లి మండలం గంటాపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఈరయ్యకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పోకిరీకి దేహశుద్ధి



మహేష్‌ను స్తంభానికి కట్టేసిన దృశ్యం

కదిరి అర్బన్: వివాహితను వేధించిన పోకిరీకి స్థానికులు దేహశుద్ధి చేశారు. కదిరి మండలంలోని ఓ గ్రామంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. నల్లమాడ మండలానికి చెందిన యువకుడు మహేష్ మద్యం మత్తులో ఓ వివాహితతో ఆమె ఇంటి వద్ద అసభ్యంగా ప్రవర్తిస్తూ తన కోరిక తీర్చాలని గొడవకు దిగాడు. గమనించిన భర్త, బంధువులు వెంటనే మహేష్‌ను పట్టుకుని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. కాగా, ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని సీఐ నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

ప్రైవేట్ బస్సుల ఢీ

• ముగ్గురికి గాయాలు



దెబ్బతిన్న కేరళకు చెందిన మినీ బస్సు

చెన్నేకొత్తపల్లి: స్థానిక 44వ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం చోటు చేసుకున్న ప్రమాదంలో ఒకరికి కాలు విరిగింది. మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. కేరళలోని అలపూరకు చెందిన ఏడుగురు యువకులు హైదరాబాద్‌లో కావడి ఉత్సవాన్ని ముగించుకుని తమ మినీ బస్సులో ఆదివానం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం ఉదయం చెన్నేకొత్తపల్లి వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారి పక్కన ఆపిన కియా కంపెనీను వెనుక నుంచి ఢీకొనడంతో మినీ బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కేరళకు చెందిన అర్జున్‌కు ఎడమ కాలు పాదం వద్ద విరిగింది. అగిల్, రాహుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినటుపోలీసులు తెలిపారు.

పోషకాహార లోపాన్ని నివారించండి : కలెక్టర్



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: పోషకాహార లోపాన్ని నివారించేలా ప్రజలను చైతన్య పరచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు.ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి అక్టోబర్ 11 వరకు జరిగే 'పౌష్టికాహార మాసోత్సవం' కార్యక్రమానికి సంబంధించి రూపొందించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో ఆయన విడుదల చేసి, మాట్లాడారు. ఐసీడీఎస్ పీడీ ప్రమీల మాట్లాడుతూ.. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా ప్రధానంగా ఐదు అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇన్‌చార్జ్ డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, డీపీఓ సమత, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సత్వర సేవలు అందించాలి

అత్యవసర సమయంలో రోగులకు సత్వర సేవలు అందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఆవరణలో సోమవారం 108 అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతమున్న 33 అంబులెన్స్ వాహనాల ద్వారా రోగులకు అత్యవసర వైద్య సేవలు అందుతున్నాయన్నారు. తాజాగా అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన అంబులెన్స్‌లు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఫైరోజ్ బేగం, ఎన్టీఆర్ వైద్య సేవల కోర్డినేటర్ శ్రీదేవి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మధుసూదన్, 108 సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందజేసిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 233 వినతులు అందాయి. కలెక్టర్ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. పెండింగ్, బియాండ్ ఎస్‌ఎల్‌ఏ, రీఓపెనింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇన్‌చార్జ్ డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, డీపీఓ సమత, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యం

సీజీ ప్రాజెక్ట్‌లో తమకు జరుగుతున్న అన్యాయాన్ని పరిష్కరించి న్యాయం చేయకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యంమని ప్రాజెక్ట్ మత్స్యకార సహకార సంఘం సభ్యుడు రమణా నాయక్‌తో కలసి పలువురు మత్యకారులు కలెక్టర్ వద్ద గోడు వెల్లబోసుకున్నారు. తనకల్లు మండలంలోని సీజీ ప్రాజెక్ట్ మత్స్యకార సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న తమకు తెలియకుండా మత్స్యకార శాఖ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించిన శంకరయ్య నెల్లూరు ప్రాంతానికి చెందిన వారికి చేపల వేటకు అనుమతులు ఇచ్చారన్నారు. 50 టన్నులకు పైగా చేపలను పట్టుకుని వారు అమ్ముకున్నారన్నారు. గతంలోనూ పలుమార్లు కదిరి ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదని, ఇప్పటికైనా తమకు న్యాయం చేయకపోతే కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యకు పాల్పడతామని హెచ్చరించారు.

లారీ డ్రైవర్ దుర్మరణం

ముదిగుబ్బ: పట్నం పీఎస్ పరిధిలో చోటు చేసుకున్న ప్రమాదంలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. హైదరాబాద్ నుంచి తమిళనాడుకు వెళుతున్న లారీ సోమవారం ముదిగుబ్బ మండలం ఎస్‌ఎస్‌పీ కొట్టాల వద్దకు చేరుకోగానే డ్రైవర్ రోడ్డు పక్కన ఆపి కాలకృత్యాలు తీర్చుకునేందుకు సిద్ధమయ్యాడు. రోడ్డు పక్కనే ఉన్న బోర్ వద్ద నీళ్ల పట్టుకొచ్చేందుకు వెళుతుండగా వేగంగా దూసుకొచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో లారీ డ్రైవర్ మాధవన్ (51) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని తమిళనాడులోని వేలూరుకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. భార్య, పిల్లలు లేరు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హుండీ కానుకల అపహరణ

ముదిగుబ్బ: మండలలోని బూదనంపల్లిలో సోమవారం తెల్లవారుజామున బూదనమ్మ ఆలయంలో చొరబడిన దుండగులు హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను అపహరించారు. ఎంత మేర చోరీ అయింది నిర్ధారణ కావాల్సి ఉంది. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



నాటికలోని ఓ సన్నివేశం

సత్యసాయి వైభవం.. భక్తజన పరవశం

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన కాంచీపురం సత్యసాయి భక్తులు సత్యసాయి వైభవాన్ని చాటుతూ నిర్వహించిన ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను పరవశింపజేశారు. సోమవారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి యూత్, బాలవికాస్‌కు చెందిన యువతులు 'శ్రీ సత్యసాయి కరుణామృత కావ్యం' కాలక్షేపం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ×గాన వైభవ సాయి' పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు. సాయంత్రం కాంచీపురానికి చెందిన సత్యసాయి యూత్ షిరిడీ సాయి సత్యసాయి ఇద్దరు ఒక్కటే అన్న సందేశాన్నిస్తూ నాటికను ప్రదర్శించారు. 'షిరిడీ కే మహల్సాపతి, పర్తి కే కౌన్' పేరుతో నిర్వహించిన నాటిక భక్తులకు చక్కటి సందేశాన్నిచ్చింది.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న కాంచీపురం భక్తులు

ఎట్టకేలకు అంత్యక్రియలు పూర్తి



అంత్యక్రియలకు మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని బసంపల్లిలో దళితుడు నారాయణ మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే గ్రామంలో దళిత (మాల) సామాజిక వర్గానికి చెందిన శ్మశాన స్థలం వివాదంలో ఉండడంతో మృతదేహం ఖననానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. అంత్యక్రియలు అదే శ్మశానంలో చేయాలని ఓ సామాజిక వర్గం వారు... కోర్టు వివాదంలో ఉండడంతో అక్కడ చేయరాదని మరరో వర్గం వారు పట్టుపట్టారు. విషయం తెలుసుకున్న ధర్మవరం ఆర్డీఓ మహేష్, డీఎస్పీ హేమంతకుమార్, చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎస్‌ఐ సత్యనారాయణ ప్రత్యేక చొరవ తీసుకుని ఇరువర్గాలతో చర్చించారు. త్వరలో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీనివ్వడంతో మృతుని కుటుంబ సభ్యులు, దళిత సామాజిక వర్గానికి చెందిన వారు అంగీకరించారు. దీంతో గ్రామ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో మృతదేహాన్ని సోమవారం ఖననం చేశారు.

రైల్వేస్టేషన్‌లో వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

గుంతకల్లు: స్థానిక రైల్వేస్టేషన్‌లోని మూడో ప్లాట్‌ఫారంపై ఓ గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 60 నుంచి 65 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి ప్లాట్‌ఫారంలోని 22వ పోల్ వద్ద అనారోగ్యంతో మృతి చెందాడు. చామధాయ రంగు కలిగి ఉన్నాడు. గడ్డం పెరిగి ఉంది. ఆచూకీ తెలిసిన వారు 98661 44616కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

అడుగుకో గుంత.. తీరని జనం చింత!



ఓడీసీలో గుంతలమయమైన ప్రధాన రోడ్డు



కొత్తచెరువు రైల్వే ట్రాక్ దాటగానే ఛిద్రమైన రోడ్డు

- ఛిద్రమైన రహదారులు
- నాసిరకంగా ప్యాచ్ వర్కులు
- రోజుల వ్యవధిలోనే తిరిగి గుంతల మయం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో రోడ్లు అధ్వానంగా మారాయి. కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షాలకు రహదారులన్నీ దెబ్బతిన్నాయి. ఎటు చూసినా కంకర తేలి, గుంతలు పడిన దారులే కనిపిస్తున్నాయి. దీంతో అధికారులు వేసిన ప్యాచ్ వర్క్ కేవలం ఆరు నెలలకే వెలసి పోయి రోడ్లన్నీ తిరిగి గుంతలమయమయ్యాయి.

ప్యాచ్ వర్క్‌కు రూ.20 కోట్లు

ఇటీవల జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురవడంతో రోడ్లు గుంతలమయ్యాయి. దీంతో రూ.20 కోట్లు వెచ్చించి ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. ఒక్కో నియోజక వర్గానికి రూ.3 కోట్ల నుంచి రూ. 4 కోట్ల వరకూ వెచ్చించారు. అయితే పనులు నాసిరకంగా చేయడంతో ఆరు నెలలు తిరగకనే గుంతలు పడ్డాయి. పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, కదిరి, పెనుకొండ మడకశిర నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాల రహదారులు మరీ అధ్వానంగా మారాయి. గుంతల మయమైన రహదారుల్లో ప్రయాణం సాగించలేకపోతున్నామని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం పుట్టపర్తికి వచ్చే రహదారులన్నీ ఛిద్రం కావడంతో ఆ మార్గంలో ప్రయాణించే దేశవిదేశీ భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పరువు తీస్తున్నారంటూ పలువురు ఎద్దేవా చేస్తున్నారు. మరో 70 రోజుల్లో సత్యసాయి శత జయంతి వేడుకలు ప్రారంభకానున్నాయి. ఇలాంటి తరుణంలో రహదారుల మరమ్మతు పనులు నాణ్యతతో చేస్తారో లేదో వేచి చూడాలి.

రోడ్లన్నీ పాడయ్యాయి



ఇటీవల రోడ్లకు వేసిన ప్యాచ్ వర్క్ మొత్తం ఎక్కడికక్కడ మటుమాయమైంది. దీంతో పుట్టపర్తికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్యాచ్ వర్క్‌కు వెచ్చించిన రూ.కోట్లు దుర్వినియోగం అయ్యాయి. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి.

– రవినాయక్, పుట్టపర్తి

ఇటీవల మట్టి వేశారు



ఈ ఏడాది సంక్రాంతి పండుగకు వేసిన ప్యాచ్ వర్క్ చేశారు. అయితే ఎక్కడే కానీ దాని ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. దీంతో గుంతలమయమైన రహదారిలో తిరగలేక కొందరు యువకులు స్వచ్ఛందంగా మట్టితో పూడ్చి వేశారు.

– లక్ష్మిరెడ్డి, ఓడీసీ